క్లుప్తంగా

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులన్నారు. అభ్యర్థులు 18–26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

సరుకులు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రీయ విద్యాలయ వర్కర్లు, డ్రైవర్లకు దసరా కానుకగా నిత్యావసర సరుకులను అందించినట్లు కేవీకే పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి జితేంద్ర తెలిపారు. గురువారం పాఠశాల వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మానవ హక్కుల జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శివరాం, కేవీకే ప్రతినిధులు కిరణ్మయి, రమేష్‌బాబు, సునీల్‌కుమార్, గురుభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫొటోగ్రఫీపై అవగాహన

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం, కడప ఫొటో వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలో ఆధునిక ఫొటోగ్రఫీపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరాంలు తెలిపారు. కడప నగరంలోని నెహ్రూ పార్కువద్ద గల రాజ్ మయూర గార్డెన్స్‌లో ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

21 నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేకంగా ఉత్సవాలను నిర్వహించనున్నామని శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్థానిక సంస్థలతోపాటు పలువురు టీవీ యాంకర్లు, కమెడియన్లు, హాస్యనటులు, డ్యాన్స్‌మాస్టర్ల బృందాలతో ఈ మూడు రోజులు నృత్యప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

'బృంద'కు దాతల చేయూత



వృద్ధులకు దుస్తులను అందజేస్తున్న ఆదర్శ ఫౌండేషన్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమానికి దాతలు చేయూతనందించారు. గురువారం కువైట్‌లో ఉంటున్న వారు ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులతోపాటు స్వెట్టర్లు, దుస్తులు అందజేశారు. దాతలు మాట్లాడుతూ కువైట్‌లో నివసిస్తున్న మిత్రులను కలిసి ఏ ఆధారం లేని అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు తమవంతుగా సాయం చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బృంద వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య, మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

నగరంలో శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: ఇజ్రాయిల్‌లో మానవత్వం మంటకలుస్తోందని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకులు షా మొహమ్మద్ అన్నారు. గురువారం కడప నగరంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కడప నగర అధ్యక్షులు లయన్ ఫటాన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాలో పిల్లలు, వృద్ధులు, మహిళలను చూడకుండా అతి కిరాతకంగా చంపుతున్నారన్నారు.

లక్కీ డ్రాలో విజేతకు బహుమతి అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–రాజంపేట మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం ఏర్పాటు చేసిన లక్కీ డిప్ స్కీమ్‌లో అక్టోబరు 1 నుంచి 15వ తేది వరకు ప్రయాణించిన వారి టిక్కెట్ల ద్వారా విజేతలకు బహుమతులు అందజేశామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండులో ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేశారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి కడపకు చెందిన భారతి, రెండవ బహుమతి మాధవరానికి చెందిన ధనుష్, మూడవ బహుమతి కడపకే చెందిన జబీర్ అహ్మద్‌కు అందించారు.

శివకామినీ.. జయశుభ కారిణి

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదవ రోజున గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. సాయంత్రం 7.00 గంటల్లోపు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ఆలయాలు గల వీధులన్నీ ఉత్సవాలకు వస్తున్న భక్తులతో కళకళలాడుతున్నాయి. సెలవులు కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనాలకు తరలి వస్తున్నారు.

■ దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై భక్తులను కరుణించారు. మాడవీధుల్లో భక్తుల పూజలు అందుకున్నాడు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని స్కంధమాతగా కొలువుదీర్చారు. ప్రధాన అలంకారానికి ఇరువైపుల అమ్మవార్లలో ఇతర రూపాలలో అలంకరించి కొలువుదీర్చారు. స్థానిక చిన్నారులు ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.

■ అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీని మోహినీగా అలంకరించారు. చుట్టూ ఏర్పాటు చేసిన తోట సెట్టింగ్ ఆహ్లాదం గొలిపింది. పండ్లు, పూలతో కళకళలాడింది. శివలింగంపై నీళ్ల పడుతున్నట్లుగా ఏర్పాటు చేసిన సెట్టింగ్ కూడా అలరించింది.

■ గడ్డిబజారు శ్రీ సత్యదేవుని ఆలయంలో స్వామికి కాళీయ మర్దన అలంకారం చేశారు. బాల పోలేరమ్మను శ్రీ మోహినీగా తీర్చిదిద్దారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శ్రీ సరస్వతిదేవి అలంకారం, భావనారుషి ఆలయంలో అమ్మవారిని శ్రీకాశీ విశాలాక్షిగా అలంకరించి కృత్రిమంగా తోటను ఏర్పాటు చేసి కొలువుదీర్చారు. పావురాలు, బాతులు తదితర పక్షులు, కుందేళ్లు లాంటి జంతువులు భక్తులను ఆకర్శించాయి. శ్రీలలితాంబికను శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా, గడ్డిబజారులోని శ్రీ కళాంబదేవిని శ్రీలక్ష్మిగా అలంకరించారు.

■ ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని శ్రీ మోహినిగా, నడివీధి గంగమ్మను గజలక్ష్మిగా తీర్చిదిద్దారు. చలమారెడ్డిపల్లెలోని శ్రీ దశమహా విద్య భువనేశ్వరీదేవిని శ్రీ లలిత బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. నాగరాజుపేట నాగమునెమ్మ తల్లికి విశేష అలంకారం నిర్వహించారు. ఇంకా నబీకోట రామలింగ చౌడేశ్వరీ, నాగరాజుపేట రాజరాజేశ్వరి, బేల్దారివీధి గంగమ్మ ఆలయం, రాజారెడ్డివీధిలోని గంగాదేవి, సరస్వతి ఆలయాలలో కూడా ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు.



గరుడ వాహనంలో దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు



విశేష అలంకారంలో నాగరాజుపేట నాగమునెమ్మ తల్లి



శ్రీ మోహినీగా బాల పోలేరమ్మ



బాలపోలేరమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



శ్రీ రాజేశ్వరీగా లలితాంబ



శ్రీ లలిత బాల త్రిపురసుందరిగా భువనేశ్వరీమాత



శ్రీలక్ష్మిగా కళాంబదేవి



కాళీయ మర్దనునిగా శ్రీ సత్యనారాయణస్వామి



శ్రీ గజలక్ష్మిగా నడవీధి గంగమ్మ



భావనారుషి ఆలయంలో శ్రీ కాశీవిశాలాక్షి అలంకారం



తోట ఉత్సవంలో శ్రీ మోహినీగా వాసవాంబ



స్కంధమాతగా శ్రీ విజయదుర్గమ్మ

ప్రతి ఇంటికీ గ్రీన్ మ్యాట్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో నూతనంగా నిర్మించే ప్రతి ఇంటికీ గ్రీన్ మ్యాట్ వేయించుకునేలా చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. గురువారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా 34వ డివిజన్ అల్మాస్‌పేట్, 35వ డివిజన్ నకాష్ ప్రాంతాలను ఇంజనీరింగ్ విభాగ అధికారులు పబ్లిక్ హెల్త్ విభాగ అధికారులు , టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. యునాని ఈ ఎల్ ఎస్ ఆర్ ట్యాంకు వద్ద ప్రజలు కూర్చునేందుకు సిట్ అవుట్ ఏర్పాటు చేయుటకు తగిన ప్రణాళికలు చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. కేసీ కెనాల్ రోడ్డు నాణ్యత లోపాలను పరిశీలించాలని ఆదేశించారు. నకాష్‌లో వాటర్ పైప్ లైన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గోపాల స్వామి స్ట్రీట్‌లో రోడ్డు, డ్రైనేజ్ ఏర్పాటుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఏ షంషీర్ పాల్గొన్నారు.



నకాష్‌లో పర్యటిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

సంప్రదాయ చిత్రకళ సజీవం

వైవీయూ : సంప్రదాయ చిత్రకళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని తెలంగాణకు చెందిన చిత్రకారుడు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు డా.కె.శ్రీనివాసాచారి పేర్కొన్నారు. గురువారం వైవీయూలో లలితకళల విభాగం విద్యార్థులకు 'ఎగ్ టెంపరా పెయింటింగ్' అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియకు కావాల్సిన కాన్వాస్‌ను ప్రిపరేషన్ నుంచి రంగుల మిశ్రమం ఎలా చేయాలో వివరిస్తూ పెయింటింగ్ చేశారు. వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ ఎగ్ టెంపరా ప్రక్రియ కళలో శ్రీనివాసాచారి నిపుణులు అని కొనియాడారు. పరీక్షల ఎగ్జామినర్‌గా విచ్చేసిన ఆయన విద్యార్థులు, అధ్యాపకుల విజ్ఞప్తి మేరకు సంప్రదాయ కళాపద్ధతిని ప్రదర్శించి చూపడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలు శ్రీనివాసాచారిని అభినందించారు.



ఎగ్ టెంపరా పెయింటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న డా. కె. శ్రీనివాసాచారి

చేతక్ షోరూం ప్రారంభం

కడప కార్పొరేషన్ : హరూన్ బజాజ్ వారి చేతక్ ఎలక్ట్రిక్ బైక్ షోరూం కడపలో ప్రారంభమైంది. స్థానిక శంకరాపురంలో ఎస్‌బీఐ పక్కన గురువారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు ఈ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూంలోని చేతక్ వాహనాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సరికొత్త ఆధునిక హంగులతో అందరినీ ఆకట్టుకునే విధంగా రివర్స్ బటన్ సౌకర్యంతో బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వాహనం అందుబాటులోకి వచ్చిందన్నారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు వారు తాళాలు అందజేసి, డెలివరీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, షోరూం ఎండీ అహ్మద్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



చేతక్ వాహనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

వ్యవసాయ పురోగతిలో మహిళా రైతుల పాత్ర కీలకం

కడప అగ్రికల్చర్ : వ్యవసాయ పురోగతిలో మహిళా రైతులదే కీలకపాత్ర అని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆత్మ ఆధ్వర్యంలో ఇప్పెంట రైతు భరోసా కేంద్రంలో మహిళా రైతులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడం గురించి వివరించారు. అలాగే సేంద్రియ పంటల ద్వారా పండించిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం కలుగుతుందని వివరించారు. కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య వేరుశనగ పంటలలో తీసుకోవాల్సిన మెలకువల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ మహిళా రైతులు సుబ్బమ్మ, పద్మావతిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ మహిళా రైతులను సన్మానిస్తున్న ఆత్మ పీడీ విజయలక్ష్మి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్ : జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 29వ డివిజన్‌లోని మాచుపల్లి బస్టాండ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా షేక్ కాలీమూన్ అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, ఇంటి స్థలం ద్వారా రూ.10.32 లక్షలు లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది.



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

■ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అనే వ్యక్తి మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, అలాగే దాదాపు రూ.6 లక్షల విలువజేసే ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి నగదు ద్వారా సుమారు రూ.9.73లక్షలు మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేశాడు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపాడు.

■ ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ రిజ్వాన్, ఇన్‌చార్జి డిష్ జిలాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోట క్రిష్ణ, ఎస్. సుబ్బారెడ్డి, రహీం, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, విజయకుమారి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కడప కార్పొరేషన్ : పేదల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చొరవ చూపుతున్నారని, వారి వ్యాధులను నయం చేయించడానికి ఎన్ని లక్షలైనా మంజూరు చేస్తూ పెద్ద మనసు చాటుకుంటున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం స్థానిక ఉపముఖ్యమంత్రి నివాస క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 12 లక్షల ఎల్ ఓ సి, రూ. 70 వేల చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు ఎన్. సుబ్బా రెడ్డి, తోట కృష్ణ పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున డిమాండ్ చేశారు. గురువారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలను చెల్లించలేదన్నారు. అలాగే మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో తీవ్రజాప్యం నెలకొందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఆర్థిక అంశాన్ని పరిశీలించి చెల్లింపులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, కార్యదర్శులు గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోటల్ సింహ విలాస్ ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరం చెన్నూరు బస్టాండు వద్ద కైలాస్ ప్రింటింగ్ ప్రెస్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ సింహ విలాస్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. హోటల్ ప్రొప్రైటర్ నాగరారపు సింహశేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను అధిగమించాలి

కడప ఎడ్యుకేషన్ : ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని అధిగమించేందుకు పట్టుదలతో సాగలని కేఎస్‌ఆర్‌ఎం కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ సూచించారు. గురువారం కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కల్చరల్ కమిటి ఆధ్వర్యంలో నూతన బిటెక్ విద్యార్థులకు ఆరాబ్ట్ – 2కె 23 ఫ్రెషర్స్ డేను కళాశాల సభాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్‌ఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జానమద్దికి ఘన నివాళి

కడప కల్చరల్ : చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ లాంటి తెలుగు భాషావేత్త గురించి తెలుగు వారికి తెలిపేందుకు ఆయన పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఆయన ఖ్యాతికి శాశ్వతత్వం కల్పించిన డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషి మరువలేనిదని రచయిత సాక్షాత్కారం రమణారెడ్డి అన్నారు. గురువారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో జానమద్ది జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. జనార్ధనరాజు మాట్లాడుతూ జానమద్ది పేరిట ప్రత్యేక సంచిక వెలువరించే అవకాశం లభించడం తన జీవితానికి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని జానమద్ది తపస్సులా భావించారన్నారు. ఈనెల 29న తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన పేరిట అవార్డును వైజ్ఞానిక అంశాల రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, రచయిత కల్లూరు బాల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జానమద్ది చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలను ఆయన తోపాటు యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సుబ్బయ్యలు ప్రారంభించారు. దీక్షల్లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన్‌విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేషబాబు, సహాధ్యక్షుడు రవికుమార్, సీపీఎస్ కన్వీనర్ సుదర్శన్ కూర్చున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో వివిధ ప్రాంతాలకు రాకపోకలతో కడప ఆర్టీసీ బస్టాండులో రద్దీ నెలకొంది. గురువారం ఉదయం నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు సుదూర ప్రాంతాలకు ప్రయాణికులు బయలుదేరి వెళ్లారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అధికారులు అదనపు సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

